క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పాత వెంకటేశ్వర స్వామి ఆలయ 55వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. 12 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనడం అదృష్టం



గోటితలంబ్రాల దీక్షలో పాల్గొన్న భక్తులు

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో పాల్గొనడం తమ అదృష్టమని మండలంలోని అహ్మదీపూర్ భక్తులు అన్నారు. రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో శనివారం అహ్మదీపూర్‌లో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు రామకోటి రామరాజుకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

దొంగిలించిన సామగ్రిని కొనొద్దు

ఏసీపీ యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

సిద్దిపేటకమాన్: దొంగిలించి తీసుకువచ్చిన సామగ్రి, వస్తువులను కొనుగోలు చేయకూడదని సీసీఎస్ ఏసీపీ యాదగిరి ఆదేశించారు. సిద్దిపేటలోని స్క్రాప్ దుకాణాల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగిలించి అమ్ముతున్నట్లు సమాచారం ఉందని, అలాంటి వాటిని కొనుగోలు చేయవద్దన్నారు. డబ్బులకు ఆశపడి సెంట్రింగ్ డబ్బాలు, కాపర్‌వైర్, అల్యూమినియం వైర్, ఇతర సామగ్రిని కొనుగోలుచేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో పదవులివ్వండి



నినాదాలు చేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): మంత్రి వర్గంలో మాదిగలకు రెండు మంత్రి పదవులివ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ధర్మారం కుమార్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో శనివారం డప్పుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా అంబేడ్కర్, డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ షమీం అక్తర్ నివేదికలో ఉన్న లోపాలను సవరించి అన్ని కులాలకు రిజర్వేషన్లను అందేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో శాంతికుమార్, శంకర్, రవి, బాలపోచయ్య, వంశీ, కుమార్, నవీన్, శేఖర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడండి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం శివారు భూములకు కాలువల ద్వారా నీటిని అందించి పంటలు కాపాడాలని రైతులు వేడుకున్నారు. శనివారం వారు మాట్లాడుతూ తమ భూములకు సమీపంలో ఉన్న అన్నపూర్ణ ప్రాజెక్టు కాలువలోకి నీరు వదిలితేనే పంటలకు నీరు అందుతుందన్నారు. ప్రాజెక్టులో నీరుండి పంటలు ఎండుతున్నాయని వాపోయారు. వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాన వేణు, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, రమేశ్, శ్రీశైలం తదితరులున్నారు.

మహిళా శక్తి అసామాన్యం



సిద్దిపేటకమాన్: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ కానిస్టేబుళ్లను సన్మానించిన సీఐ ఉపేందర్

జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, సంఘాలు, పార్టీల కార్యాలయాల్లో మహిళలను శనివారం ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాణించిన మహిళలకు బహుమతులు అందించారు.



దుబ్బాకరూరల్: మహిళ ప్రజాప్రతినిధులకు సన్మానం



గజ్వేల్‌రూరల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో మహిళా నాయకులను సన్మానిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు



ములుగు(గజ్వేల్): క్షీరసాగర్‌లో మహిళా ఉద్యోగులకు సన్మానం



గజ్వేల్‌రూరల్: కోర్టు ప్రాంగణంలో జడ్జి ప్రియాంకను సన్మానిస్తున్న న్యాయవాదులు



దుబ్బాకలో మహిళా సిబ్బందితో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు



హుస్నాబాద్‌రూరల్: వంగరామయ్యపల్లిలో కేక్ కట్‌చేస్తున్న మహిళలు



కొమురవెల్లి(సిద్దిపేట): కేక్‌కు బదులుగా పుచ్చకాయ కటింగ్



చిన్నకోడూరులో కేక్ కట్‌చేస్తున్న మహిళా ఉద్యోగులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళా నాయకులను సన్మానిస్తున్న హరికృష్ణ తదితరులు

పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలి



నినాదాలు చేస్తున్న మహిళలు, సీఐటీయూ నాయకులు

గజ్వేల్‌రూరల్: పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించి, సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవమంటే కుటుంబంలో వివక్ష లేకుండా చూడాలని, సమాన అవకాశాలు కల్పించడం అన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, కృష్ణమూర్తి, సుభద్ర, కల్పన, మనోహరి, సుధారాణి, ఫాతిమా, కృష్ణలీల, సంధ్యారాణి, పావని తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల యుక్తి చాలా గొప్పది



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ సువర్ణ

సిద్దిపేటకమాన్: మహిళల యుక్తి చాలా గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ సువర్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట డిపోలో మహిళా ఉద్యోగులతో కలిసి శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రిటైర్ కాబోతున్న మహిళ కార్మికురాలిని, డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చిన సిబ్బందిని డిపో మేనేజర్ సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో డీఎం సుఖేందర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందడుగుతోనే అభివృద్ధి



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న రజిత

హుస్నాబాద్: ముందడుగుతోనే మహిళల అభివృద్ధి సాధ్యం అని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రజిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఎండీ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రజిత మాట్లాడుతూ మహిళా పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని శుభ్ర పర్చడంలో ముఖ్య భూమికను పోషిస్తున్నారన్నారు.

చెట్ల కొమ్మలతో ప్రజల ఇబ్బందులు

తొలగింపజేసిన సీఐ విద్యాసాగర్



కొమ్మలు తొలగింపజేస్తున్న సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్): మండలంలోని రాంపల్లి, దుద్దెడ గ్రామాల శివారులో రాజీవ్ రహదారిలో రోడ్డుకు రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను పోలీసు అధికారులు శనివారం తొలగింపజేశారు. రాజీవ్ రహదారి పక్కన పోలీస్ కమిషనర్ కార్యాలయం, ఆక్సిజన్ పార్కులను గత ప్రభుత్వం నిర్మించింది. మర్పడ్గ, ఖమ్మంపల్లి, సిర్సనగండ్ల, రాంపల్లితో పాటు మరి కొన్ని గ్రామాల ప్రజలు నిత్యం పనులపై అక్కడికి వెళ్తుంటారు. అయితే ఆ దారిలో పెరిగిన చెట్ల కొమ్మలు ప్రయాణానికి ఆటంకంగా మారాయి. అది గుర్తించిన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, పోలీస్ హౌజింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్ జేసీబీ సహాయంతో కొమ్మలు, చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ రోడ్డు గుండా కొన్ని గ్రామాల ప్రజలు నిత్యం ఆక్సిజన్ పార్కు, పోలీస్ కమిషనర్ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలకు వెళ్తుంటారని, కొమ్మలు పెరగడంతో మూల మలుపుల వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అది గుర్తించి కొమ్మలను తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీహరి, అశోక్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ త్రిశక్తి ఆలయంలో బీజేపీ నేతల పూజలు

గజ్వేల్‌రూరల్: అమ్మవారి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గురువారెడ్డి అన్నారు. ప్రజ్ఞాపూర్‌లో త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లను శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యవంతులుగా, సంతోషంగా ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలోని మహంకాళీ మాత, పెద్దమ్మతల్లి, నల్ల పోచమ్మ తల్లికి భక్తులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ వర్గీకరణ ఆకాంక్షను చాటుతాం

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మాదిగ వర్గానికి రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ నంగునూరులో శనివారం డప్పుచప్పుళ్లతో వారి ఆకాంక్షను చాటారు. కార్యక్రమంలో రాజు, యాదయ్య, నరేశ్, నర్సింహారావు, రాజమౌళి, భూమయ్య, కనకయ్య, బాలరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

◆ యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశం

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను గ్రామాగ్రామానా ప్రజలకు వివరించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివసాయిగౌడ్ సూచించారు. మండలంలోని శ్రీరాములపల్లిలో యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ఇతర పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరవింద్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ అధికారులకు సన్మానం

గజ్వేల్: మండలంలోని రిమ్మనగూడలోని పెద్ద చెరువు వెనుభాగంలో కొంత కాలంగా ట్రాన్స్‌ఫార్మర్ లేక ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యను విద్యుత్ శాఖ అధికారులు తీర్చారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు పాలేటి నర్సింహారావు, చక్రధారి శర్మ తదితరులు విద్యుత్‌శాఖ ఏడీఈ జగదీశ్, ప్రజ్ఞాపూర్ ఏఈ సత్యంను సన్మానించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ హన్మంతు, జూనియర్ లైన్‌మెన్ నర్సింహులు, కాంట్రాక్టర్ గంగారం పాల్గొన్నారు.

◆ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ లిఖిత అన్నారు. పట్టణంలోని ఆ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వాటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం మహిళా దినోత్సవం నిర్వహించి మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, రత్నమాల, వాణిశ్రీ, దేవిక, కావేరి, భారతి, ఆర్షియా, అనురాధ, నుస్రత్, మానుష, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మైత్రీవనం ఫీడర్ పరిధిలోని విద్యుత్‌లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పాండరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దానిలో భాగంగా ఆదర్శనగర్, మహాశక్తినగర్, మైత్రీవనం, రాజేంద్రనగర్, వినాయక నగర్, విఘ్నేశ్వరనగర్, బీజేఆర్ చౌరస్తా, కాకతీయనగర్, ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొన్న ఘటన చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడేనికి చెందిన మాలోతు సాయి కుమార్ ఓ వాహనంలో నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని మద్దూరు పోలీస్‌లకు అప్పగించారు. పోలీసులు వాహనాన్ని సీజ్‌చేసి సాయి కుమార్‌ను అదుపులోకి తీసుకొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పయ్యావుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను శుక్రవారం తొగుట నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు, రూ.1100లు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఆ సంఘం జిల్లా సహాయ ప్రధాన కార్యదర్శులు హరీశ్, సాయికిరణ్, మండల అధ్యక్షుడు పయ్యావుల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షుడు సురేశ్, అనిల్, శంకర్, అశోక్, రాజు, కిష్టయ్య, వెంకటేశ్, రాములు, సురేశ్, అజయ్ పాల్గొన్నారు.

నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుస్నాబాద్: భారతదేశంలో రిజర్వ్‌బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని సాధన సమితి చైర్మన్ డాక్టర్ పరశురాం డిమాండ్ చేశారు. 26న ఢిల్లీలో నిర్వహించనున్న కళాకారుల ధూంధాం కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి సారిగా కరెన్సీ విలువను ప్రజలందరికీ తెలియజేసిన మహానుభావుడు డా.బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ధూంధాం కార్యక్రమానికి కవులు, రచయితలు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనజాగృతి కళా సమితి అధ్యక్షుడు సంపత్ కుమార్, మల్లేశం, రాజు, అశోక్, సంపత్, వెంకట్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో బిల్లులు.. టీచర్లకు ఇబ్బందులు



మాట్లాడుతున్న ఎస్టీయూ నేత భూపాల్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పటికీ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని, దీంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు భూపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీఓ భవన్‌లో శనివారం ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రాములు, రాజేశం, భిక్షపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన జల వివాదం

- నీటి మళ్లింపుతో రైతుల మధ్య వాగ్వాదం
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన పంచాయితీ



రైతులను సముదాయిస్తున్న ఇరిగేషన్ అధికారులు

నంగునూరు(సిద్దిపేట): రెండు మండలాల మధ్య కొద్ది రోజులుగా నెలకొన్న జల వివాదం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. రంగనాయకసాగర్ కుడికాలువ నీటిని చేర్యాల మండలంలోని కొన్ని గ్రామాలకు మళ్లించేందుకు అధికారులు ప్రయత్నించగా నంగునూరు రైతులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. నంగునూరు మండలం నుంచి పారే రంగనాయక సాగర్ కుడికాలువ ఎల్‌డీ -10పై చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద ఓటీ నిర్మాణం చేపడతారనే సమాచారంతో నంగునూరు రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి కమలాయపల్లి వచ్చి ఇక్కడి రైతులకు సాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం ఇరిగేషన్ అధికారులు రంగనాయక సాగర్ నీటిని మళ్లించేందుకు రాగానే బీఆర్ఎస్ నాయకులు రైతులతో వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో కమలాయపల్లి, దానంపల్లి రైతులు వారితో వాగ్వాదానికి దిగడంతో తోపులాటకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ జేఈఈ రాజు, చేర్యాల హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇరు వర్గాల వారికి నచ్చజెప్పారు. పంటలు ఎండి పోతున్నందున తాత్కాలికంగా నీటిని మళ్లిస్తున్నామని నంగునూరు మండలానికి నష్టం కలుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగారు. దీంతో నీటి మళ్లింపును పూర్తిచేసి కమలాయపల్లికి నీరు తరలించారు.